# మహర్జాతకుడు

**మా**ధవ మహర్జాతకుడు. ఆ మాట అతను పుట్టగానే అతని తాతగారు పంచాంగం చూసి చక్రంవేసి ఘంటాపదంగా చెప్పారుట.

అసలే మగబిడ్డ, పైగా మహర్జాతకుడు కూడానూ అని సంబరపడిపోయారు అందరూ. వారి ఇంట్లో అటువైపూ ఇటువైపు కూడా సామాన్యమైన కుటుంబాలే. అటు ఐశ్వర్యమూ లేదు. ఇటు దరిద్రమూ లేదు. తండ్రి సీతారామశాస్త్రి ఆ ఊళ్ళో ఏకైక పురోహితుడు. అదో చిన్నగ్రామం. అందరూ కలివిడిగా వుండేవారు. మంచి జరిగినా చెడు జరిగినా శాస్త్రులవారి చేతులమీదుగా జరగాలి. కాబట్టి ఆయనకి జరుగుబాటు బాగానే వుండేది. నలుగురు కూతుళ్ళకి సలక్షణంగా పెళ్ళిచేసి పంపించాడు.

ఆ తర్వాత రోజులు మారిపోయాయి. జనం గ్రామాల్ని వదిలి పట్టణాలకు వలసలు పోయారు. చెరువు ఎండిపోతే చేపలు విలవిల్లాడినట్లు గ్రామాల్ని నమ్ముకున్నవారు కూడా పొట్టచేత బట్టుకొని ఊరు దాటక తప్పలేదు. అటువంటి గడ్డురోజుల్లో మాధవ్ తన పోషణ తాను చూసుకోవలసిన వయసుకి ఎదిగాడు. తనూ పట్నానికి వెళ్తానన్నాడు. మంచిరోజు చూశారు. తండ్రి చేరబిలిచాడు. 'నీకు మన పరిస్థితులన్నీ తెలుసు. నీకు ఇవ్వడానికి నా దగ్గర ఆస్తిలేదు. అదృష్టం ఏమిటంటే అప్పూ ఇవ్వడంలేదు. ఈ పౌరోహిత్యంలో అయితే పైకి రాలేనేమో అని ఇంగ్లీషు చదువే చెప్పించాను. మరి అది నీకు ఎంతవరకూ ఉపయోగపడుతుందో తెలియదు. వెళ్ళు. ప్రపంచంలో ఎంతమంది బతకడంలేదు. వాళ్ళల్లో నువ్వూ ఒకడివి. ఎప్పుడైనా నీకు ఏదైనా అవసరం వుంటే నాకు జాబు రాయి. నా దగ్గరుంటే నీకేమైనా పంపిస్తాను.

లేదూ, నిన్ను ఆదుకోమని ఆ పరమాత్ముడిని వేడుకుంటాను. తండ్రిగా నీకు నేను చేయగలిగినది ఇంతే' అంటూ కిందటిరోజు ఎవరో సత్యనారాయణ వ్రతం చేయించుకుని ఇచ్చిన దక్షిణ నూటపదహార్లు చేతిలో పెట్టాడు నీళ్లునిండిన కళ్ళతో.

తల్లి మాత్రం ధైర్యంగానే వుంది. 'వాడికేం మహర్జాతకుడు. పెద్దమేడలో వుంటాడు. వాహనయోగం వుంది. తన చేత్తో పదిమందికి అన్నం పెడతాడు. ఈ మాట ఆనాడు మా తండ్రిగారు ఘట్టిగా చెప్పారు' అంది సంతోషంగా.

మాధవ్ బస్తీకి చేరాడు. రెండు సంవత్సరాలు నానా అవస్థలూ పడ్డాడు. తండ్రి దగ్గర నుండి డబ్బు తెప్పించుకుంటూ ఏవేవో చిన్నా చితకా పనులు చేశాడు. ఇక్కడైతే లాభంలేదు. హైదరాబాదులో ఉద్యోగాలు రాసులుపోసుకుని కూర్చున్నారట. అక్కడికి వెళ్దాం అని తోటివాళ్ళు బయలుదేరుతూ వుంటే వాళ్ళతోబాటు తనూ బయలుదేరాడు.

హైదరాబాదు చేరాడు. అది మహానగరం. ఎంతమంది వచ్చి చేరినా కాదనదు, లేదనదు. ఉద్యోగాలూ వున్నాయి. కానీ వాటికి చాలా అర్హతలుండాలి. అర్హతలు సంపాదించాలంటే డబ్బులుండాలి. అర్హతలు లేకపోయినా అడ్డుదోవన ఉద్యోగాలు సంపాదించవచ్చు. కానీ వాటికి లంచాలివ్వాలి. లంచాలివ్వాలంటే మళ్లీ డబ్బులుండాలి.

మాధవ్ దగ్గర ప్రస్తుతం లేనిది డబ్బే కాబట్టి నిలకడగా ఫేనుకింద కుర్చీలో కూర్చునే ఉద్యోగాలు రావు. అతనికటువంటి ఆశలూ లేవు. తండ్రిని డబ్బు అడక్కుండా ముందు తన కాళ్ళమీద తను నిలబడాలి. ఆ తరువాత తండ్రి సంపాదించలేక మూలపడినప్పుడు వాళ్ళిద్దరికీ ఇంత అన్నం పెట్టాలి.

అందుకే పాపం దొరికిన పనల్లా చేశాడు. చూస్తుండగా ఒకటి కాదు రెండు కాదు ఎనిమిదేళ్ళు గడిచిపోయాయి. ఈ గడిచిన కాలంలో మాధవ్ చాలా నేర్చుకున్నాడు. నిజానికి జీవితం నేర్పిన పాఠాలకు తిరుగులేదు. ఏ కాలేజీలూ, ఏ యూనివర్సిటీలు నేర్పని ఎన్నో విషయాలను జీవితం నేర్పుతుంది. అలా నేర్చుకున్న మనిషి ఎక్కడైనా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా బతికేయగలడు.

మొదట్లో ఎందుకొచ్చిన వెధవ జీవితం? ఏ హుస్సేన్‌సాగర్‌లోనో దూకి చావడం మేలు... అనుకునే వాడు ప్రతిరోజు రాత్రి సమయంలో. మళ్లీ తెల్లవారగానే పోనీ ఇవ్వాళ ఒక్కరోజూ చూద్దాం అని ఒక కప్పు చాయ్ తాగి దినచర్య మొదలుపెట్టేవాడు.

తర్వాత ఆత్మహత్య చేసుకోవాలనే ఆలోచనే మానేశాడు. బతకాలి. వడ్డించిన విస్తరివంటి జీవితం వున్నవాడు హాయిగా బతికేస్తాడు. వాడి గొప్పేంలేదు. కానీ ఆకు దగ్గర్నుంచి శ్రమతో సంపాదించుకుని దాంతో విస్తరి కుట్టుకుని పిడికెడు అన్నం తినగలిగిన వాడే ధన్యజీవి. తను అటువంటి ధన్యజీవుల్లో ఒకడు. కాబట్టి కష్టపడాలి, జీవించాలి.

ఆ నిర్ణయానికి వచ్చిన తర్వాత మాధవ్‌లో నూతనోత్సాహం ప్రవేశించింది. ఏ పూటకు ఆ పూటే పరగడుపు. చేస్తున్న ఉద్యోగం వూడిపోతే మరో ఉపాధికోసం వెతుకులాట. ఉద్యోగం దొరికాక ఆ వచ్చే కాస్త జీతంతో నెలంతా ఎలా గడపాలా అనే ఆలోచన. వున్న రెండు జతల బట్టల్లో ఒకటి చిరిగిపోయేలోగా మరో జత ఏర్పాటు చేసుకోవాలనే తపన. జీవితం నిత్యనూతనం.

మాధవ్ ఇక్కడ ఇట్లా నిత్యనూతనంగా బతికేస్తుంటే అక్కడ తండ్రి మాత్రం కాస్త దిగులు పడుతున్నాడు. తనకు జవసత్వాలుడిగిపోతున్నాయి. అన్ని పూజలకూ కేసెట్లు రావడంవల్ల ఆదాయమూ తగ్గిపోతుంది. ఇప్పటివరకూ ఫర్వాలేదు. ఏదో ఆ పరమాత్ముడి దయవల్ల ఇద్దరం రెండుపూటలా తినగలుగుతున్నాం. ఇక ముందు ఎలా గడుస్తుందో అని దిగులుపడతాడు. అంతలోనే 'ఏం ఫర్వాలేదు అనన్యా శ్చింతయంతో మా యేజనాః పర్యుపాసతే అని గీతలో భగవానుడు చెప్పినట్లా భారం అంతా ఆయన మీదే వేశాను. నా మంచీ చెడ్డా ఆయనే చూసుకుంటాడు' అని ధైర్యం తెచ్చుకుంటాడు తనకు చాతనయినంతలో శక్తివంచన లేకుండా ఆదిత్య హృదయం, హనుమాన్ చాలీసా, విష్ణుసహస్రం చదివి దాని ఫలం అంతా కొడుక్కి ధారపోస్తుంటాడు.

తల్లి మాత్రం ధైర్యంగా వుంది. వాడికేం మహర్జాతకుడు. పెద్ద భవనం, వాహనం, రాజయోగం. మా తండ్రిగారు చెప్పారు. కాస్త అటూ ఇటూ ఐనా ఖచ్చితంగా జరిగి తీరుతుంది అని ధీమాగా చెప్తుంది.

మొత్తానికి అంతా బాగానే వుంది. కాలం జరిగిపోతూనే వుంది. హఠాత్తుగా మాధవ్ జీవితం మలుపుతిరిగింది. ఎవరూ అందుకోలేనంత ఎత్తుకి ఎదిగాడు. అతని నివాసం మామూలు మనుషులు కన్నెత్తి చూసే అవకాశంలేని జూబ్లీ హిల్స్‌లో ఒక పెద్ద భవనంలో.

ఎక్కడికి వెళ్ళినా కార్లో వెళ్తాడు. ఇప్పుడతని దగ్గర బోలెడు బట్టలున్నాయి. అన్నీ టాప్‌బ్రాండ్ వస్త్రాలే. పోనీ కష్టపడి రోజుకి పద్దెనిమిది గంటలు కళ్ళు పీకేలా

కంప్యూటర్ ముందు కూర్చొని బుర్ర బద్ధలు కొట్టుకుంటాడా అంటే అసలు గుమ్మం కదిలే పనేలేదు.

ప్రస్తుతం సమాజంలో మామూలువాడు కోటీశ్వరుడు అవడం అంత విడ్డూరం ఏమీ కాదు. రాజకీయాల్లో నిలదొక్కుకుంటే కావలసినంత డబ్బూ, అధికారం. ఎవరి అండ అయినా చూసుకొని స్మగ్లింగ్ లాంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాలుపడితే కనకవర్షం కురుస్తుంది. ఇవేమీ కాకుంటే మహేశ్వరం వంటి బీడుభూముల్లో కాస్త చోటువున్నా కోటీశ్వరుడై పోవచ్చు. కానీ మాధవ్ ఇవేమీ చెయ్యలేదు. కాలం కలిసొచ్చింది అంతే.

ఆ, వేళ కూడా మామూలుగా రెండు సంచులనిండా వాషింగ్‌పౌడర్ పేకెట్లు నింపుకుని ఇల్లిల్లూ తిరిగి అమ్మే పనిమీద బయలుదేరాడు. బహుళ అంతస్తుల భవనాల దగ్గరికి వెళ్తే వాచ్‌మేన్ తోలేస్తాడు. ఇండిపెండెంట్ హౌస్‌లలో కుక్కలు తరుముతాయి. ఒకవేళ కుక్కలు లేకపోయినా తలుపు తడితే తలుపుతీసి వాళ్లను డిస్టర్బ్ చేసినందుకు నానా తిట్లూ తిట్టి మొహాన్నే ధడాల్న తలుపు లేసేస్తారు.

ఇవన్నీ సేల్స్‌మేన్‌గా తలపండిపోయిన మాధవ్‌కి అలవాటే. ఎన్ని కష్టాలు ఎదురైనా పొద్దుటినించి సాయంకాలందాకా తిరిగితే కొంచెం సరుకు అమ్ముడుపోతే వచ్చే కమీషన్‌తో రెండు జొన్నరొట్టెలు తిని టీ నీళ్లు తాగవచ్చని ఆశ. అందుకే ఎవరెన్ని విసుక్కున్నా దులిపేసుకుని ముందుకిపోతాడు.

అయిదారు ఇళ్లల్లో అడిగి వద్దనిపించుకొని పరధ్యానంగా నడుస్తున్న మాధవ్ పక్కభవనంలోంచి వస్తున్న కారుహారన్ వినిపించుకోలేదు. కారు ఢీకొంది. కింద పడ్డాడు మాధవ్.

ఇక ఇప్పుడు ఈ కారాయన దండకం మొదలుపెడతాడు. నీకు చెవుడా! హారన్ వినిపించలేదా? నువ్వంతగా చావాలనుకుంటే నా కారే దొరికిందా? వంటి దీవెనల కోసం ఎదురు చూస్తూ మెల్లిగా లేచాడు.

డ్రైవింగ్ సీట్లోంచి దిగాడు పెద్దమనిషి

'అరె! దెబ్బతగిలిందా! ఐయాంసారీ! వెరీ సారీ!' అంటూ కంగారు పడ్డాడు. మోచేతి మీద చెక్కుకుపోయింది మాధవ్‌కి.

ఆ దెబ్బ బాధగావున్నా ఆ కారు యజమాని ఆదరానికి సంతోషం వేసింది.

'ఫర్వాలేదు. మీ తప్పేంలేదు. నాదే పొరబాటు' అన్నాడు మాధవ్.

‘మీకు బాగా తగిలింది. రండి లోపలికి వెళ్దాం ఫస్ట్‌ఎయిడ్ చేస్తాను’ అన్నాడాయన.

‘వద్దండీ, నేను వెళ్ళాలి’ మొహమాటపడ్డాడు మాధవ్.

బలవంతపెట్టి లోపలికి తీసికెళ్లాడు కారాయన.

ఆయన మాటలోనే యాక్సెంట్, ఆ వేషధారణ చూస్తుంటే విదేశాల్లో నివసించే భారతీయుడని తెలిసిపోతోంది. ఆయనని ఎక్కడో చూసినట్లు ఏదో మూలజ్ఞాపకం!

ఆయన కారు రివర్స్ చేసి పార్క్‌చేసి వచ్చాడు. కమాన్ అంటూ మాధవ్ బేగ్ ఒకటి అందుకుని లిఫ్ట్‌లో పైకి తీసుకువెళ్లాడు.

ఫ్లాట్ ముందు ఆగి బెల్ నొక్కగానే ఆయన భార్య తలుపు తీసింది. అపుడే వచ్చావేం అని అడిగింది. ఈయన చెప్పాడు. అరెరె అని ఆవిడ కూడా కంగారు పడిపోయింది.

ఇద్దరూ మాధవ్‌ని తీసుకెళ్ళి కుర్చీలో కూర్చోబెట్టారు. గాయానికి చికిత్స మొదలు పెట్టాడు ఆయన. ఆవిడ మంచి నీళ్లు, కాఫీ ఇచ్చింది.

మాధవ్ చుట్టూ చూశాడు. అది డీలక్స్ త్రీ బెడ్‌రూమ్ ఫ్లాట్. దర్జాగా వుంది. హాల్లో ఓ పక్కగా సోఫాలో కూర్చొని వున్నారు వృద్ధదంపతులు. దీక్షగా టి.వి. చూస్తున్నారు.

మాధవ్ రాగానే వీళ్ళవంక చూసి ఏదో అడగబోయి మానేసి మళ్ళీ టి.వి.లో మునిగిపోయారు.

వాళ్ళని చూడగానే ఏదో జ్ఞాపకం. ఎవరా వీళ్ళు, బాగా ఎరిగున్నవాళ్ళే ఎవరో? ఎవరు? ఎంత తన్నుకున్నా జ్ఞాపకం రావటంలేదు.

ఆయన యాంటీసెప్టిక్ లోషన్ రాసి కట్టుకడుతున్నంత సేపూ ఆలోచిస్తూనే వున్నాడు.

‘ఎందుకైనా మంచిది ఒక ఇంజక్షన్ తీసుకోండి’ అన్నాడాయన కట్టుకట్టడం ముగించి.

అప్పుడు గుర్తొచ్చింది మాధవ్‌కి. ఆ పెద్దాయన తమ ఊళ్ళో వుండే సాయన్న. మనిషి మారిపోయాడు బాగా. అవునో కాదో నిర్ధారణ చేసుకుందామని అడిగేశాడు.

‘మీది రాంభద్రపాలెం కదూ!’ అంటూ.

ఆయన మొహంలో మార్పు వచ్చింది. 'అవును!' అన్నాడు.

'ఆయన సాయన్న కదూ!' మళ్ళీ అడిగాడు మాధవ్.

'అవును. మరి మీరు?' అనుమానంగా అడిగాడు ఆయన.

'నేను నరసింహశాస్త్రిగారి మనవడిని. మా తండ్రిగారు సీతారామశాస్త్రిగారు' చెప్పాడు.

'నాన్నా మనూరి శాస్త్రులుగారి అబ్బాయి నాన్నా!' అంటూ కేకపెట్టాడు సంభ్రమాశ్చర్యాలతో.

అప్పటిదాకా టి.వి.లో లీనమైపోయిన ఆవిడ చివాల్న లేచి వచ్చింది. 'ఎవర్రా చిన్నాడా?' అని అడిగింది.

'మనూరి అయ్యవారి మనవడే అమ్మా' అని చెప్పి తండ్రి దగ్గరికి వెళ్లాడు. ఆయనకి కాస్త వినికిడి శక్తి తగ్గింది. ఏవిటా ఈ హడావిడి అని తెల్లబోయి చూస్తున్నాడు. కొడుకు వచ్చి విషయం చెప్పేసరికి ఆయన మొహం ఇంతయింది. లేచి వచ్చి మాధవ్ దగ్గరకూర్చున్నాడు.

'నువ్వు మా శాస్త్రుర్లుగారి మనవడివా అయ్యా? బావున్నావా? అమ్మా నాయనా బావున్నారా? ఎక్కడుంటున్నావు? ఏం చేస్తున్నావు? మనూరు ఎట్లా వుంది? బావుందా? ఏటేటా దేవుడి కల్యాణం జరుగుతోందా? పుట్టలమ్మ తల్లికి తిరణాళ్లు చేస్తున్నారా? శిడిమాను ఎత్తుతున్నారా? బుచ్చెయ్యగారింట్లో అంతా బావున్నారా? కారుగంటి వాళ్ళక్కడ్నే వున్నారా? ఊరొదిలి వెళ్ళిపోయారా? ఊళ్లోకి బస్సొస్తోందా? పంపులొచ్చాయా లేకపోతే మంచినీళ్ల బావేనా?

ఏనాడో పుట్టి పెరిగిన ఊరి నుండి తరలింపబడిన ఆ వృద్ధుడికి మళ్ళీ ఇంతకాలానికి తమ ఊరివాడు కనిపించేసరికి పట్టరానంత సంబరం కలిగింది. కళ్ళనీళ్లు తిరిగాయి.

ఎటొచ్చీ మాధవ్ ఈ ప్రశ్నల పరంపరకి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరి అయ్యాడు. ఆయనెక్కడైనా ఆపితే తను మాట్లాడదామని తాపత్రయ పడ్డాడు.

చివరికి ఆయన ఉద్వేగంతో ఆయాసపడుతూ ఆగిపోయాక తనూ దాదాపు పదేళ్ళ కిందట ఊరొదిలి వచ్చేశాననీ చెప్పి తనకు తెలిసిన వివరాలు చెప్పాడు.

'మా నాన్నకి చాదస్తంలే. అందులోనూ మనూరంటే ప్రాణం. చాన్నాళ్ళుగా అక్కడి కబుర్లేం తెలీవేమో, నిన్ను చూసేసరికి ప్రాణం లేచొచ్చిందాయనకి. నువ్వేం

పట్టించుకోకు' అంటూ తండ్రిని నాన్నా, 'మనూళ్ళో శేషుడని వుండేవాడు. వాడికీ మాకు మంచి సాహసం వాడెక్కడున్నాడు? ఊరిబయట తాటి తోపులున్నాయా? అప్పట్లో ఎండాకాలం అంతా అక్కడే వుండేవాళ్ళం. తాటి ముంజెలు కొట్టుకు తింటూ' అని తనూ వివరాలు అడిగాడు కొడుకు చిన్నతనం జ్ఞాపకం చేసుకుంటూ.

వీళ్ళ గొడవ చూసి తెల్లబోయి వుండిపోయింది కోడలు. 'ఎవరీ అబ్బాయి, మీకు తెలుసా?' అని అడిగింది.

అయ్యో తెలీకపోవడం ఏం, మనూరివాళ్ళే. వాళ్ళ తాతగారూ నేనూ ఒకే తరం వాళ్ళం. మా ఇంట్లో ఏం జరిగినా అయ్యవారు మంచిరోజు చూడాల్సిందే. నా పెద్దకొడుకు రాజన్నకి రెండోవాడు సత్యన్నకీ నీ మొగుడు చంద్రన్నకి పేర్లు పెట్టిందాయనే.

'నీ కొడుకులు రాజ్యాలు ఏల్తార్రా సాయన్నా అనేవాడు. ఎప్పుడెళ్ళినా ఇంత కంచు గ్లాసెడు కాఫీ ఇచ్చేది వీళ్ళ నాయనమ్మ' అంటూ మొదలు పెట్టి గత జీవితంలో తమకు గల బాంధవ్యాన్ని చెప్పాడు, ముసిలాయన.

ఆయన్నొదిలేస్తే అట్లా ఏళ్ళతరబడి చెప్పుకుపోతాడు. కాబట్టి తండ్రికి బ్రేక్ వేశాడు చంద్రన్న.

'అవన్నీ సరే ఇప్పుడేం చేస్తున్నావ్?' అంటూ అడిగాడు.

తన కుటుంబం సంగతి చెప్పాడు మాధవ్. తన సంగతీ చెప్పాడు.

వాళ్ళ కుటుంబం గురించి చెప్పాడు చంద్రన్న. పెద్దన్నగారు నలభై ఏళ్లకిందటే అమెరికా వెళ్ళిపోయాడు. ఆ తర్వాత వీళ్లిద్దరూ కూడా వెళ్ళారు. ముగ్గురూ అక్కడే సెటిల్ అయ్యారు. పిల్లలూ అక్కడే వున్నారు అంతా బావుంది.

మా పెద్దన్న తోటివారు మీ నాన్నగారు. మేము ఊరొదిలేసరికి నువ్వింకా చిన్నవాడివి అన్నాడు ఆదరంగా.

'మాధవ్ నువ్వు నాకు సాయం చెయ్యాలయ్యా!' అన్నాడు హఠాత్తుగా.

'ఇంత ఘనంగా వున్నారు. వీరికి నేనేం సాయం చెయ్యాలి?' ఆశ్చర్యంగా ఆయన్నే అడిగేశాడు బరువుగా నిట్టూర్చాడు చంద్రన్న.

వాళ్లు ఊరువదిలి చదువులకని విజయవాడ వచ్చారు. పెద్దవాడు విశాఖపట్నంలో ఇంజనీరింగ్ పూర్తిచేసి అమెరికా వెళ్లాక రెండోవాడి ఉద్యోగం కోసం

హైదరాబాద్ వచ్చారు. ఆ తర్వాత అతనూ అమెరికా వెళ్ళాడు. చివరాఖరుగా చంద్రన్న వెళ్లాడు.

పెద్దవాళ్లు మాత్రం ఇండియాలోనే వుండిపోయారు. బలవంతాన తీసుకువెళ్ళినా అక్కడ ఇమడలేకపోతున్నారు. ఆర్నెల్లుండేసరికి మళ్లీ ప్రయాణం కడతారు. అక్కడ మీకు ఎవరున్నారు అంటే వినరు.

ఈ మధ్య వాళ్ళకి బొత్తిగా ఓపిక తగ్గిపోతోంది. ప్రయాణాలు చెయ్యలేం అంటున్నారు. ఇదిలా వుండగా ఎప్పుడో పాతికేళ్ళ క్రిందట జూబ్లీహిల్స్‌లో స్థలం కొన్నాడు పెద్దన్నగారు. అదలా వదిలేస్తే అన్యాక్రాంతం అయిపోతుందని ముగ్గురూ కలిసి పెద్ద ఇల్లు కట్టారు. తీరా కట్టేక ఏం చెయ్యాలో అర్థంకాలేదు. ఏ గెస్ట్ హౌస్‌గానో అద్దెకివ్వాలి. కానీ ఆడవాళ్లొప్పుకోలేదు. ఇంత ముచ్చటపడి కట్టుకుంది అద్దెకివ్వడానికా? వీల్లేదు. అందులో పెద్దవాళ్ళు వుంటారు, మనం హాలిడేస్‌కి వచ్చిపోతూ వుందాం అన్నాడు.

అన్నదమ్ముల ముగ్గురుకీ అప్పటికే మంచి ఏరియాల్లో తలో ఫ్లాటూ వున్నాయి. ప్రస్తుతం ఆఖరి కొడుకింట్లో వుంటున్నారు. ఈ ఫ్లాట్లో ఒంటరిగా వుండటమే ప్రాణాంతకంగా వుంది మాకు. ఆ ఎద్దంత కొంపలో మేం వుండలేం. మమ్మల్ని ఏదైనా వృద్ధుల ఆశ్రమంలో వుంచి వెళ్ళండి. మీ ఇళ్ళు అద్దెలకిచ్చుకుంటారో తాళాలే వేసుకుంటారో మీ ఇష్టం అని ఖచ్చితంగా చెప్పేశారు.

ముగ్గురు కొడుకులుండీ, నాలుగు స్వంత ఇళ్ళుండీ ఏ దిక్కూలేని వాళ్ళలాగా తల్లిదండ్రులని ఆశ్రమంలో వదలడానికి వాళ్ళకు ప్రాణం ఒప్పడంలేదు.

పోనీ వంతుల ప్రకారం వాళ్ళే వచ్చి ఇండియాలో వుందామన్నా వీలు కాదు. అక్కడ పిల్లలున్నారు, పన్లున్నాయి.

ఇక ఒక్కటే మార్గం. ఎవరైనా నమ్మకమైన మనిషి దొరికితే ఇంట్లో తల్లిదండ్రులకు తోడుగా వుంచి వెళ్లాలి కానీ దొరకవద్దూ. అంత ఇంటినీ పెద్దవాళ్లైన తల్లిదండ్రులనీ ఎవరిమీద నమ్మకంతో వదలాలి?

మాధవ్ కనిపించేసరికి చంద్రన్నకి ఆశ కలిగింది. 'మాధవ్ మన ఊళ్ళో ఎవరైనా మనిషి ఉన్నాడేమో చూడు. నమ్మకస్తుడు దొరికితే మంచి జీతం ఇస్తాను. వసతి, భోజనం మా దగ్గరే. మన ఊరివాళ్ళయితే నమ్మకంగా వుంటారు. మాకూ నిశ్చింత. చీటికీ మాటికీ వచ్చిపోయే దూరం కాదు. మాకు అవకాశం వున్నప్పుడు

వంతులవారీగా వచ్చి చూసిపోతాం. మాకు డబ్బుకేం కొదవలేదు. తగిన వ్యక్తి దొరికితే కాస్త ఎక్కువైనా ఫర్వాలేదు' అన్నాడు.

ఆ మాటలకు మాధవ్‌కి ఆశ కలిగింది. 'మీకు అభ్యంతరం లేకపోతే నన్ను పనిలో పెట్టుకుంటారా?' అని అడిగాడు.

అదిరిపడ్డాడు చంద్రన్న, 'నిన్నా, మా ఇంట్లోనా? ఒద్దొద్దు. మా వాళ్ళల్లో ఎవర్నైనా చూడు' అన్నాడు.

'ఏం? నా మీద మీకు నమ్మకం లేదా?' నొచ్చుకుంటూ అడిగాడు మాధవ్.

'ఛ, ఛ కాదు మాధవ్ బాబూ. నువ్వు పెద్దింటి బిడ్డవి. మా ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగినా మీ ఇంటికి బియ్యం, పప్పూ కాయగూరలూ ఇచ్చేవాళ్ళం. మీకూ మాకూ చాలా తేడా వుంది. చిన్నవాడివి నీకు తెలియదు' అన్నాడు చంద్రన్న.

'అవన్నీ, అప్పటి రోజులు చంద్రన్నా. ఇప్పుడు రోజులు మారిపోయాయి' చెప్పాడు మాధవ్.

'ఏం మారినా కొన్ని ఆచారాలు మారవు. నా మాట విను. ఒకవేళ నేను ఒప్పుకున్నా మా నాన్నా అమ్మా ఒప్పుకోరు. మా తిండి అలవాట్లు వేరు. నువ్వు సర్దుకోలేవు. నీకు ఇబ్బందిగా వుంటే నేను ఏదైనా సహాయం చేస్తాను. ఏ చిన్న వ్యాపారమో పెట్టుకో. మా ఇంట్లో పనికి మాత్రం వేరే వాళ్ళని చూడు. నిన్ను మా దగ్గర పనికి పెట్టుకోలేను' ఖచ్చితంగా చెప్పాడు చంద్రన్న.

బరువుగా నిట్టూర్చాడు మాధవ్. 'ఎన్నో ఉద్యోగాలకు నా అర్హత సరిపోయినా రిజర్వేషన్లవల్ల నాకు ఉద్యోగం రాలేదు. ఇక్కడ ఏ పోటీ లేదు కదా? ఈ ఉద్యోగం నాకు దొరుకుతుందేమో అని ఆశపడ్డాను. కానీ ఇక్కడా నా కులమే నాకు అడ్డంకి అవుతోంది. వద్దు పొమ్మన్నా బతిమాలుతున్నాని కోపగించుకోవద్దు చంద్రన్నా. మీరు సహాయం చేస్తానన్నారు. ఏదో చిన్నవ్యాపారంతో ప్రారంభించి తెల్లవారేసరికి లక్షాధికారిగా మారిపోవడానికి ఇది సినిమా కాదు, జీవితం. మీరు సాయం చేసినా నేను నిలదొక్కుకోవాలంటే చాలా సమయం పడుతుంది.

'నాకంత వ్యవధి లేదు. నాన్నా అమ్మా పెద్దవాళ్లైపోతున్నారు. పస్తులుంటున్నాం అని చెప్పుకోడానికి మొహమాటపడి ఉపోషాలు అని సర్దిచెప్పుకుంటున్నారు. వారి బాధ్యత నా మీద ఉంది. ఇంకొంతకాలం ఇదే విధంగా గడిస్తే ఏమైనా జరగవచ్చు.

‘ఏనాడో తాతల నాడు మీరు మాకు స్వయంపాకం ఇచ్చారనే కారణం పక్కనపెట్టండి. నేటి నా పరిస్థితి గురించి కొంచెం ఆలోచించండి. మీ తల్లిదండ్రుల సుఖం కోసం మీరెంత ఆరాటపడుతున్నారో నేనూ నా తల్లిదండ్రుల గురించి అంతే ఆరాటపడుతున్నాను. నా మటుకు నాకు ఏ పని అయినా ఒక్కటే. విదేశాలలో పెట్రోల్ బంక్‌లో పనిచేయడం తప్పుకానప్పుడు ఇక్కడ తెలిసిన వారింట్లో పనివాడిగా పనిచెయ్యడం కూడా తప్పేమీ కాదు.

‘నా బాధ అర్థంచేసుకుని నాకీ ఉద్యోగం ఇస్తే మీ పేరు చెప్పుకుని ఆ పెద్దవాళ్ళకు రెండుపూటలా కడుపు నిండా అన్నంపెట్టి వారి ఋణం తీర్చుకుంటాను. కాదూ అంటే నా దురదృష్టం అనుకుంటాను. జీవితంలో ధక్కామొక్కీలు తినడం నాకు అలవాటే’ అంటూన్న మాధవ్‌కి చాలాకాలం తర్వాత కళ్ళనీళ్లు వచ్చాయి. తలపక్కకి తిప్పేసుకున్నాడు.

చంద్రన్న మనసు కరిగిపోయింది.

‘పోనీ శాస్త్రుర్లుగారికి ఏమైనా ధనసాయం?’ అంటూండగానే చివాల్న తలెత్తాడు మాధవ్.

‘వద్దు చంద్రన్నా, ఇస్తే ఉద్యోగం ఇవ్వండి, దానం మాత్రం వద్దు. ఎలాగో మా పాట్లు మేం పడతాం. మీకు వేరే మనిషిని చూస్తాను’ అన్నాడు.

ఒక్క క్షణం ఆలస్యం చెయ్యలేదు చంద్రన్న.

‘వద్దయ్యా నువ్వే వుండు. నీకు అమ్మనీ నాన్ననీ అప్పగిస్తే నాకూ నిశ్చింత’ అన్నాడు.

వెంటనే మిగిలినవన్నీ మాట్లాడుకున్నారు. ఊళ్లోని మూడు ఫ్లాట్లూ అద్దెకిస్తారు. ఆ అద్దెలూ వసూలు చేసుకుని ఆ డబ్బుతో ఇల్లు నడపాలి. మిగిలింది బ్యాంకులో వెయ్యాలి. మాధవ్‌కి జీతం అయిదు వేలు.

తండ్రిని ఒప్పించడం బ్రహ్మ ప్రళయం అయింది చంద్రన్నకి. ఎంతో నచ్చచెప్తేగానీ ఒప్పుకోలేదు ఆయన.

మాధవ్ పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి తన వివరాలన్నీ ఇచ్చివచ్చాడు. చంద్రన్న వద్దులే అన్నా వినలేదు.

ఇంటికి కావలసిన హంగులన్నీ అమర్చి మాధవ్‌కి అన్ని బాధ్యతలూ అప్పజెప్పి నిశ్చింతగా అమెరికా వెళ్ళిపోయాడు చంద్రన్న. డబ్బు చాలకపోతే ఇంకా పంపుతాం, వాళ్ళకే లోటూ రానివ్వకు అని మరీ మరీ చెప్పాడు వెళ్లేముందు.

మాధవ్ బస ఆ ఇంటి సర్వెంట్ క్వార్టర్‌కి మారింది.

ఒక ఆల్సేషన్ కుక్కని కొన్నారు. ఒక పనిమనిషిని ఏర్పాటు చేశారు. తోటమాలి వచ్చి రెండు మూడు గంటలు పనిచేసి వెళ్లిపోతాడు.

పనమ్మాయి వచ్చి ఇల్లు తుడిచి బట్టలుతికి వెళ్ళిపోతుంది. మిగిలిన పనులన్నీ మాధవ్‌వే.

పొద్దున్నే క్వార్టర్‌కి వెళ్లి స్నానం చేసి వస్తాడు. పనిమనిషి వచ్చాక దగ్గరుండి పనులన్నీ చేయిస్తాడు. బజారు పనులూ బయటపనులూ చేస్తాడు. డ్రైవింగ్ నేర్చుకున్నాడు. నెలకోసారి వాళ్లిద్దర్నీ డాక్టర్ దగ్గరికి తీసుకువెళ్తాడు. ప్రతిరోజూ సాయంత్రం వాళ్లిద్దరినీ తప్పనిసరిగా బయటకు తీసుకువెళ్తాడు. గుడికో, సినిమాకో, షికారుకో, లేకపోతే బంధువుల ఇళ్ళకు. అన్నింటినీ మించి వాళ్ళ ఊరి గురించి బోలెడు కబుర్లు చెప్తాడు. ఆవిడకు వంట దగ్గర సాయం చేస్తాడు. ఆయనకు పేపరు చదివి వినిపిస్తాడు. రాత్రి హాల్లో పడుకుంటాడు. వీలు చూసుకుని వాళ్ళని ఊరికి కూడా తీసికెళ్లాడు. పెద్దవాళ్ళకు ఎంతో బావుంది. ఏ మనవడి దగ్గరో వున్నట్లూ వుంది. మాధవ్‌కీ చాలా బావుంది. నీడ పట్టున వుంటాడు. కడుపునిండా భోజనం. జీతంలో మూడు వంతులు తండ్రికి పంపిస్తాడు. వాళ్ళూ నిశ్చింతగా వున్నారు.

తల్లిదండ్రులను చక్కగా చూసుకుంటున్నందుకు కృతజ్ఞతగా అమెరికాలో వున్న సాయన్న కొడుకులు ముగ్గురూ మాధవ్‌ని బాగా చూసుకుంటారు. బట్టలూ, బహుమతులూ పంపుతారు. కొన్ని కొత్తవి, కొన్ని వాళ్ళు వాడినవి. ఎలక్ట్రానిక్ వస్తువులూ, పెర్ఫ్యూమ్‌లు. వాళ్ళు చనువు ఇచ్చినా మాధవ్ అనుక్షణం తను ఆ ఇంట్లో పనివాడినని గుర్తుచేసుకుంటూ వారికి అణిగిమణిగి వుంటాడు. నీతిగా నిజాయితీగా వుంటాడు. ఒక్కరూపాయి అటూ ఇటూ అవనివ్వడు. అణా పైసలతో లెక్కరాసి వుంచుతాడు.

పెద్దవాళ్ళు వాళ్ళకి ఏ అవసరం వచ్చినా కుడీ ఎడమా చూడకుండా చేస్తాడు. కొద్దిరోజుల్లోనే మాధవ్‌కి చాలా మంచిపేరు వచ్చింది. ఆ ఏరియాలో వున్న మరికొంతమంది వృద్ధదంపతులు మాకు మంచి మనిషిని చూసి పెట్టు అని మాధవ్‌ని

అడిగారు. తన పాతమిత్రులలో మంచివాళ్ళను చూసి రెండుమూడు చోట్ల పనికి కుదిర్చాడు కూడా. వాళ్ళకి మాధవ్‌పట్ల కృతజ్ఞత.

నీడపట్టున వుంటూ నిశ్చింతగా వుండేసరికి మరింత రంగు వచ్చి చూడముచ్చటగా వున్నాడు మాధవ్.

మొదట్లో తండ్రికి చెప్పలేదు తనెక్కడ పని చేస్తున్నదీ. కాస్త స్థిరపడిన తర్వాత నెమ్మదిగా చెప్పాడు. ఆయన తలపంకించాడు. "ఈ ఆచారవ్యవహారాలు అన్నం పెట్టవురా అయినా కాలంతోపాటు మారిన మనిషి సుఖపడతాడు. ఇతరులకు ఇబ్బంది కలిగించని ఏ పనైనా గౌరవప్రదమైనదే. వాళ్ళు నీ మీద వుంచిన నమ్మకం నిలబెట్టుకో" అన్నాడు.

తల్లితో ఏ పేచీ లేదు. 'నేను చెప్పలేదూ! మా అబ్బాయి మహర్జాతకుడు మా తండ్రి గారు చెప్పిన మాట పొల్లుపోదు' అంది నిశ్చింతగా.

*జాగృతి వారపత్రిక, ఏప్రిల్ 30, 2007*